# నేను చూస్తున్న అమెరికా

ఆంధ్రభూమి వారపత్రికలో సంపాదకులు నా ఈమైల్ అడ్రస్ ఇవ్వటం వల్ల, పాఠకుల ఈ-ఉత్తరాల ద్వారా వారి స్పందన ఎలా వుందో తెలుస్తున్నది. వాటిలో ఈమధ్య ఒక సిద్ధార్థగారూ మరికొందరు పాఠక మిత్రులూ "అమెరికాలో భారతీయుల గురించీ బాగానే సమాచారం ఇస్తున్నారు కానీ, అమెరికా గురించీ, అమెరికా ఈరోజు ఇంత ముందు వుండటానికి కారణాల గురించీ, అమెరికా ఆర్థిక విధానం గురించీ వ్రాయమని" అడిగారు. చెప్పేవారికి మరి అడిగేవారు లోకువకే కాకుండా, నాకూ ఆ విషయాలు చెబితే బాగుంటుందని అనిపించింది కనుక, ఈ వ్యాసాలలో అవి చెప్పుకుందాం.

నాకు మొదటినించీ ఏదో ఊహాలోకంలో కూర్చుని వ్రాయటం కన్నా నా చుట్టూలా జరుగుతున్న విషయాలని చూసి అవి అందరితో పంచుకోవాలని తహతహగా వుండేది. అదే నా రచనలలో కనిపిస్తుందని సమీక్షలు కూడా చెబుతున్నాయి. కనుక నేను అమెరికా గురించి వ్రాస్తున్నవి అమెరికా గురించి మాత్రమే. అమెరికా ఇలా వుంటుంది అంటే, ఇండియా ఇలా వుండదని కాదు. అమెరికాలో ఇలా వుండదు అంటే, ఇండియాలో ఇలా వుంటుందని కాదు. అమెరికన్లు ఇలా వుంటారు అంటే నూటికి నూరు పాళ్ళూ ఇంతేనూ అని కూడా కాదు. చాలమంది ఇంతేనని. అదీకాక కావాలనే నేను రాజకీయ సంబంధ విషయాల గురించి వ్రాయటం లేదు. నేను చూసిన చూస్తున్న అమెరికా గురించే, తెలిసిన అమెరికా గురించే వ్రాస్తున్నాను. కనుక ఈ వ్యాసాలనీ ఎంత అవసరమో అంతే తీసుకోండి.

పదివేల సంవత్సరాల క్రితమే అమెరికాలో మానవమాత్రులున్నారనీ, ఆ తర్వాత క్రీస్తు శకం 1000నించే యూరోపియన్లు(వైకింగ్స్) అమెరికాలో కుడికాలో ఎడంకాలో పెట్టారని చరిత్ర చెబుతున్నది. స్పానిష్ ఇంగ్లీష్ ఫ్రెంచ్ డచ్‌లాటి దేశాల నించీ కొంతమంది సాహసయాత్రలు చేస్తూ వస్తే, కొంతమంది నిక్షిప్త నిధుల కోసం వచ్చారనీ, మరి కొంతమంది రాజకీయ బాధితులూ నేరస్థులూ పారిపోయి వచ్చారనీ అంటున్నారు. ఇంతలో ఇండియా వెడుతున్నానుకొని అమెరికా ఖండంలో దిగిన కొలంబస్ మహాశయుడు ఒక మహాశయనుడు. అలారకరకాల దేశాలవారి రాకతో మొదలైన అమెరికా చరిత్ర, పుస్తకాల్లో వుంది కనుక ఆ విషయాలు చెప్పాల్సిన అవసరం లేదు.

ఆనాటినించీ ఈనాటి దాకా ఎంతోమంది ఎన్నో దేశాలనించీ వచ్చినా, నాకు బాగా ఆశ్చర్యం కలిగించేది, వాళ్ళు ఎంతో త్వరగా ఈ దేశంలోనూ దేశ నిర్మాణంలో భాగమయిపోవటం. భాగ్యవంతమై పోవటం. అమెరికాలో వున్నంత జీవన వైవిధ్యం, భిన్నత్వం వేరే ఏ దేశంలోనూ కనపడదు. ఎన్నోవందల భాషలు,

సంస్కృతులు రూపాలు మతాలు. అన్నీ ఒక త్రాటిమీద నడుస్తాయి. దానికి ముఖ్య కారణాలు మూడనిపిస్తుంది నాకు. ఒకటి. లా ఆఫ్ ది లాండ్. ఎవరు ఎక్కడనించి వచ్చినా అమెరికాలో వుంటే అమెరికన్ న్యాయసూత్రాలే పాటించాలి. అందరూ ఒకటే. పూర్వపు రోజుల్లో ఎక్కువగా, ఈనాడు చాల తక్కువగా మనుష్యుల భావాల్లో చేతల్లో అసమానత కనిపించినా, ఆ అసమానతని రూపుమాపుతున్నవి ఈ దేశ న్యాయసూత్రాలూ, వాటిని మనసా వాచా పాటించే మనుష్యులూను. రెండవది- వ్యక్తిస్వాతంత్రం. ఇక్కడ ఏదైనా వదులుకుంటారు కానీ, తమ స్వాతంత్రానికి భంగం కలిగితే భరించలేరు. మరి అటు న్యాయసూత్రాల్ని అక్షరాలా పాటిస్తూ, ఇటు వ్యక్తి స్వాతంత్రాన్ని ఎలా కాపాడుకోవటం అంటే నేను చూస్తున్న అమెరికాలో ఆ రెండూ సాధ్యమే కనుక, ఇలాగే అని సమాధానం చెప్పుకోవాలి. నమ్మి తయారు చేసుకున్న న్యాయసూత్రాల్ని పాటించటం స్వాతంత్రం కానీ, పాటించక పోవటం స్వాతంత్రం కాదు. వాటిల్లో లోపాలుంటే, అదే స్వాతంత్రం ఉపయోగించి వాటిని ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా సరిదిద్దుకుంటారు. మూడవది, అవకాశాలు. మెరికలాటివారికి అవకాశాలు ఇచ్చేదే అమెరికా. సత్తువ వున్నవాళ్ళకి ఏ అడ్డూలేని దేశం. అందుకనే అవకాశాల కోసం ఎక్కడెక్కడినించో వచ్చి ఈ దేశంలో వాళ్ళు చేయాలనుకుంటున్నవి విజయవంతంగా చేయగలుగుతున్నారు.

రాజకీయంగా అమెరికా కొన్ని దేశాలతో యుద్ధాలు చేసినా కొన్ని దేశాలకి బిలియన్ల డాలర్ల సహాయం చేసినా, పత్రికలూ ప్రజలూ సమర్ధించేవారు సమర్ధిస్తారు, విమర్శించేవారు విమర్శిస్తారు. ఆ రోజు వియత్నాం యుద్ధమప్పుడు, ఇతర దేశాలలోకన్నా అమెరికాలోనే యుద్ధం ఆపేయమని ఆక్షేపణలూ, నినాదాలూ, విమర్శలూ చేశారు. అలాగే అమెరికాలో పత్రికా స్వాతంత్రం, వాటర్‌గేట్ సందర్భంలో ప్రెసిడెంట్ నిక్సన్ని పదివిలోనించీ క్రిందకి ఓంచింది. ప్రెసిడెంట్ క్లింటన్ రాసలీలల్ని ఆయన పదవిలో వున్నాడని కూడా ఖాతరు చేయకుండా కోర్టుకి తీసుకువెళ్ళింది. పత్రికలూ టీవీ ఎక్కడయినా కొంచెం పొగ కనబడితే, రాజకీయ నాయకులని నిప్పు కోసం వెతికి వారిని టీవీ తెరమీదనే ఉతికి ఆరేయటం మామూలే. రాజకీయ నాయకుల జీవితాలు అమెరికాలో తెరిచిన పుస్తకాలు.

ఇక అమెరికా ఆర్ధికంగా ఇంత స్థితికి ఎలా ఎదిగిందీ అన్నది. ఈ విషయం గురించి చాలవరకూ వచ్చే వారం కబుర్లలో తెలుసుకుందాం. అయితే ఇక్కడ కొన్ని ముఖ్యమైన విషయాలు మాత్రం చూద్దాం. అమెరికాలో చదువుకున్నవాళ్ళు నూటికి 97మంది. ఎలక్షన్లలో నాయకులకే కాక, రకరకాల విషయ పరిష్కారాలకి కూడా ఓటు వేస్తారు. ఉదాహరణకి ఒక స్కూల్‌కి కొత్త బిల్డింగ్ కట్టాలంటే బాండ్స్ ద్వారానా ఇంకే విధంగానా అని టౌన్ హాల్ మీటింగుల్లో చర్చలూ, ఆ నిర్ణయాలకి అభ్యంతరాలుంటే ఎలక్షన్లలో ఓటింగ్‌కి పెట్టి ప్రజాభిప్రాయం ఎలావుంటే అలా చేస్తారు.

అమెరికన్లు ఏం చేసినా చాల చిత్తశుద్ధితో చేస్తారు. మొదలుపెట్టింది పూర్తయేదాకా వదలరు. ఎన్ని త్యాగాలు అవసరమైనా చేస్తారు కానీ, సాధించేదాకా వదలరు. ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను. మా వూళ్ళో గుడి కట్టాలని ఎన్నాళ్ళనించో

మన దేశీయ మిత్రులు తర్జనభర్జన పడుతున్నారు కానీ, ఇంతవరకూ అది కార్య రూపం దాల్చలేదు. ఇండియానించి వచ్చిన ఒక స్వాములవారు అమెరికన్ల సహాయంతో 14 మిలియన్ల డాలర్ల ఖర్చులో మధురైనించీ వచ్చిన శిల్పుల నైపుణ్యంతో ఒక పెద్ద గుడీ, ఒక ఆడిటోరియం డైనింగ్ హాల్ పెళ్ళిళ్ళ హాలూ, కూరగాయలు పండించే తోట అక్కడే ఎన్నో ఇళ్ళూ ఎపార్ట్ మెంట్లూ కట్టేశారు. హైటెక్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నా, హిందూమతాన్ని నమ్మి, తమ స్వార్జితాన్ని అంతా వెచ్చించి అందరూ ఉమ్మడిగా అక్కడే జీవిస్తున్నారు. మన పండగలు చేసుకుంటూ మమ్మల్నందర్నీ ఆహ్వానిస్తారు. ఒకరోజు సాయంత్రం ఇండియానించి వచ్చిన మా అక్కయ్య, బావని తీసుకుని 6 గంటలా 55 నిమిషాలకి అక్కడికి జేరుకున్నాం. అక్కడి ఇళ్ళల్లోనించీ అమెరికన్లు అందరూ పిల్లా పాపలతో, ఆడవాళ్ళు చీరెలలో, మగవాళ్ళు పైజమా లాల్చీలలో చకచకా ప్రార్ధనా మందిరం వేపు వెడుతున్నారు. ఒకాయన మా దగ్గరికి వచ్చి, "ఇవాళ ప్రార్ధనకి మీరు కూడా రావటం మాకు చాల బాగుంది" అని మమ్మల్ని కూడా లోపలికి తీసుకువెళ్ళాడు. ఇది ఎందుకు చెబుతున్నానంటే, ఏం చేసినా ఎంత సంకల్పంతో, నిబద్ధతతో చేస్తారో చూపిద్దామని.

అమెరికాలో ప్రతి నిమిషం అమూల్యమే. ప్రపంచంలోకల్లా అత్యధిక ఉత్పత్తిగల దేశాల్లో అమెరికా ముందు బెంచీలోవుంది. మాకు సంవత్సరానికి ఏడునించీ తొమ్మిది రోజులు శెలవలు. పది రోజులు మాత్రమే లీవు. రోజుకి ఎనిమిది గంటల చొప్పున, వారానికి నలభై గంటల పని. ఉద్యోగంలో పైకి రావాలనుకునే వాళ్ళు, కనీసం అరవై గంటలైనా పని చేస్తుంటారు.

ఇక్కడ గవర్నమెంట్‌ని వాళ్ళ జీవితాల్లోకి రానీయరు. ఏవిధమైన కంట్రోళ్ళూ భరించలేరు. అన్నిట్లోనూ స్వాతంత్రం కావాలి. నాలాటి వాళ్ళకి పెద్ద అనుమానం వస్తుంటుంది ఎప్పుడూ. మరిక్కడ కంట్రోల్స్ లేకపోతే, అన్నీ విచ్చలవిడిగా అయిపోవా... ఎవరు వాటిని ఆపేది?" అని. దానికి జవాబు, ఆ కంట్రోల్స్ ప్రజల దగ్గరనించే వస్తాయంటే ఆశ్చర్యంగావుంటుంది. ఉదాహరణకి ఒక టీవీ స్టేషన్ ప్రతి గురువారం, మావూళ్ళో హెల్త్ ఇన్‌స్పెక్టర్ రిపోర్టుల్ని బయటపెట్టి, ఏఏ హోటళ్ళు ఎంత అధ్వాన్నంగా వున్నాయో, అవి ఎందుకు ఫెయిలయాయో ఆ హోటల్ దగ్గరే రిపోర్టర్ని నుంచోబెట్టి చూపిస్తుంటారు. కొన్ని స్టేషన్లయితే అక్కడి బొద్దింకల్ని కూడా చూపిస్తాయి. అలాగే స్కూళ్ళల్లో పేరెంట్ టీచర్ అసోషియేషన్ ద్వారా స్కూళ్ళ మంచిచెడ్డలు చూస్తుంటారు. కొత్తగా ఇంకా స్కూళ్ళు కట్టాలా వద్దా, వాటికి పెట్టుబడి సంపాదించటానికి మార్గాలేమిటి అనే విషయాల మీద, ఓటింగ్ ద్వారా ఎన్నో మార్పులు జరుగుతాయి. ప్రజాపరిపాలన జరగటం కళ్ళారా చూస్తాం.

మా కాంగ్రెస్‌మెన్‌తోనూ (మన పార్లమెంట్ మెంబర్‌లాటివాడు), సిటీ కౌన్సిలర్‌తోనూ ఇండియన్స్ అందరం కలిసి కొన్ని టౌన్ హాల్ మీటింగులు పెట్టి, ఇండియా అమెరికా సంబంధాల గురించి వాళ్ళతో చర్చించాం కూడాను.

వచ్చేసారి అమెరికా ఆర్థిక విధానం ఎలావుందో చూద్దాం.

* * *